ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 24 అక్టోబరు 2024 | 5



108 వెండి గిన్నెల బహూకరణ


వెండి గిన్నెలు అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసంలో జరిగే కుడార్రై ఉత్సవంలో స్వామివారికి ప్రసాదం నివేదనకు ఉపయోగపడే 108 వెండి గిన్నెలను బహూకరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 3వ రోజు ఆలయ మాజీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ధర్మకర్తల మండలి సభ్యులు (2019-2024) సహకారంతో వెండి గిన్నెలను డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు చేతులు మీదుగా స్వామివారికి సమర్పించారు. సుమారు రూ.10 లక్షలు విలువైన వెండి గిన్నెలు స్వామివారి కుడార్రై ఉత్సవానికి వినియోగించనున్నారు. మాజీ చైర్మన్, ధర్మకర్తలైన దాతలకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్నారు.


ఆకట్టుకున్న వేషధారణ



వైభవోపేతంగా కొనసాగుతున్న వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు


సాంస్కృతిక కార్యక్రమం


సుప్రభాత సేవ నిర్వహిస్తున్న అర్చకులు


ఉపకమిషనర్ దంపతుల పూజలు


హారతి స్వీకరిస్తున్న భక్తులు

వార్తలు..6లో

శ్రీహరివాసం వాడపల్లి ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది..బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేదీప్యమానంగా వెలుగొందుతోంది.. విశేష పూజా కార్యక్రమాలను చూసేందుకు రెండు కళ్లు చాలడం లేదు..

అదివో..అల్లదివో

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు


అమలాపురం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమలాపురం సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సీజీఆర్ఎఫ్ సదస్సు నిర్వహించనున్నట్టు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు. విశ్రాంత న్యాయమూర్తి, సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారు. వినియోగదారులు నేరుగా సదస్సులో పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, విద్యుత్ బిల్లుల సమస్యలు కొత్త సర్వీసుల జారీల్లో జాప్యం ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర ఫిర్యాదులను సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చునన్నారు. సమస్యలను గుర్తించి విచారణ జరిపి న్యాయం చేస్తుందన్నారు. కమిటీ సభ్యులు ఎస్.మసిల్మణి, ఆర్.సురేంద్రకుమార్ కూడా పాల్గొంటారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

అమలాపురం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ తెలిపారు. కోర్టు ప్రాంగణంలోని మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని, వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించనున్నట్లు చెప్పారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యానవన రైతులకు ప్యాక్ హౌస్‌లు

అంబాజీపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యాన రైతులకు కొబ్బరి నిల్వలను చేసుకునేందుకు ప్యాక్‌హౌస్‌లను రాయితీపై అందిస్తుందని ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ఉద్యానవన శాఖ ఏఈవో డి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని వక్కలంక, మొసలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ వాసంశెట్టి రేవతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఈవో డి.దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.



ఊరూరికి బెల్టు

మద్యం దుకాణాలు లేనిచోట 'బెల్టు' వ్యాపారం

గ్రామాల్లో విచ్చలవిడిగా అమ్మకాలు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మద్యం దుకాణాల లైసెన్సు ఫీజులు భారీగా పెరగడంతో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు బెల్టు షాపులకు తెరతీశారు. దుకాణాలు లేని చోట ముఖ్య కూడళ్లకు సమీపంలోను, గ్రామాల్లోను బెల్ట్‌షాపులను ఏర్పాటు చేయించారు.

రావులపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యంతో ప్రజారోగ్యాన్ని గుల్ల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని ఇచ్చిన హామీ మేరకు కొత్తగా మద్యం దుకాణాలను కేటాయించారు. దీంతో ప్రైవేటు మద్యం దుకాణాలను దక్కించుకున్న వారు వ్యాపారాన్ని విస్తరించేందుకు పలు మార్గాలు అన్వేషిస్తున్నారు. దుకాణాలు లేని శివారు ప్రాంతాలను సైతం మద్యం విక్రయాలు సాగించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. దీనిలో భాగంగానే విస్తారంగా బెల్ట్‌షాపులను ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా దాబా, రెస్టారెంట్లలోను నిబంధనలకు విరుద్ధంగా దర్జాగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. రావులపాలెం శివారు ప్రాంతాల్లోను, దేవరపల్లి, గోపాలపురం, ఈతకోటలో ప్రధానంగా బెల్టు షాపులు వెలిశాయి..

మద్యం దుకాణం దక్కించుకున్న వారే బెల్టు షాపు ఇవ్వడంతో ఇక బెల్టు షాపు నిర్వాహకులు ఇష్టమొచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారు. ఏకంగా సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి తాగిస్తున్నారు..బహిరంగంగానే రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం విక్రయాలు సాగిస్తున్నారంటూ స్థానికులు చెబుతున్నారు.


ఈతకోటలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపు

వేలానికి బెల్టు షాపులు

- ఒక్కో గ్రామానికి ఒక్కో రేటు
- బెల్టు వేటలో మద్యం సిండికేట్


కాట్రేనికోన, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా కొత్తగా ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపార విస్తరణకు వారు కొత్తదారులు వెతుకుతున్నారు. మండల వ్యాప్తంగా బెల్టు దుకాణాల ఏర్పాటుకు వ్యూహరచన చేస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నవారు ఇప్పుడు వేలం ద్వారా దుకాణాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కేంద్ర పాలిత ప్రాంతం యానాం నుంచి ఎన్డీపీ మద్యాన్ని తెచ్చి తీరప్రాంత గ్రామాల్లో విచ్చలవిడిగా అమ్ముతున్నారు. లక్షల్లో వేలం పాటలు జరుగుతున్నాయి. చిర్రయానాంలో ఇటీవల రూ.9.75 లక్షలకు వేలం జరిగింది. ఈ వ్యవహారంలో అధికారులకు భాగస్వామ్యం ఉందన్న విషయం బహిరంగ రహస్యమే. ఈ కారణంగా యానాం, గోవా మద్యాన్ని విపరీతంగా విక్రయిస్తున్నారు. నూతన మద్యం పాలసీ వచ్చే వరకు బలుసుతిప్పలో రూ.5 లక్షలు గ్రామానికి ఇచ్చే ఒప్పందంతో వ్యాపారం జరిగింది. ఇప్పుడు మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు బెల్టు దుకాణాల నిర్వాహకుల కోసం వేటలో పడ్డారు. ప్రభుత్వ విధానంతో బెల్టు దుకాణాల ఏర్పాటుతోనే ఎంతోకొంత వెనకేసుకోగలమని పాటదారులు భావిస్తున్నారు. మండలంలో ఆరు దుకాణాలకు అనుమతి వచ్చింది. వీరందరూ సిండికేట్‌గా ఏర్పాటయ్యే ప్రయత్నాలు జరుగుతున్నాయి. షాపుల నిర్వహణ విషయంలో ప్రభుత్వ నిబంధనలను సైతం బేఖాతర్ చేసేందుకు పాటదారులు సై అంటున్నారు. ఇక ఎక్సైజ్ అధికారుల అండదండలతో పాటదారులు వ్యాపారాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వివిధ గ్రామాల్లో బెల్టు షాపుల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఒక్కో గ్రామానికి పాట పెట్టి మరీ బెల్టు షాపు కేటాయించేందుకు మద్యం దుకాణదారులు పావులు కదుపుతున్నారు. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారేందుకు రంగం సిద్ధమవుతోంది.



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

అమలాపురం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 2024-25కు సంబంధించి రాష్ట్రస్థాయి అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల షెడ్యూల్‌ను క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీష్ విడుదల చేశారని జిల్లా ప్రాధికార అభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. 19 క్రీడాంశాల్లో నవంబరు 6 నుంచి 9 వరకు విజయవాడ, మంగళగిరి గుంటూరుల్లోని క్రీడా ప్రాంగణాల్లో ఈ పోటీలు జరుగుతాయి. రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యే జట్లు, క్రీడాకారులను జిల్లాస్థాయిలో ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తామని, ఏసీఎస్ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సురేష్‌కుమార్ తెలిపారు. నవంబరు 6, 7 తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, విజయవాడ డీఆర్ఆర్ఎం ఇండోర్ స్టేడియం, విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలలో అథ్లెటిక్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, లాంగ్ టెన్నిస్, హాకీ, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తారు. 8, 9 తేదీల్లో మంగళగిరి ఏసీఏ స్టేడియం, విజయవాడలోని ఐజీఎంసీ డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్, స్టేడియంలలో వెయిట్ లిఫ్టింగ్, క్రికెట్, పవర్‌లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, మ్యూజిక్, డ్యాన్స్ అండ్ షార్ట్‌ప్లే పోటీలను నిర్వహిస్తారు. క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం సెల్ 7993329433లో సంప్రదించాలని సురేష్‌కుమార్ కోరారు.

వెండి బిందె బహూకరణ



అంతర్వేది, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి గొంది గ్రామానికి చెందిన జంపన సూర్యనారాయణరాజు (కిరణ్), కుటుంబ సభ్యులు ఒక కిలో 21 గ్రాముల వెండి బిందెను బహూకరించారు. ఆలయ అర్చకులు సంప్రోక్షణ అనంతరం వెండి బిందెను స్వామివారి పాదాల చెంతన ఉంచి దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను

విజయవంతం చేయాలి

సిబ్బంది శిక్షణ తరగతుల్లో జాయింట్ కలెక్టర్ నిషాంతి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

ముమ్మిడివరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు సిబ్బందికి బుధవారం నిర్వహించిన సాంకేతిక శిక్షణా తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నియమించిన సిబ్బంది ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రైతుల కళ్లాల్లోని తేమ ధాన్యాన్ని తేమ శాతం, నూకశాతం కనుగొనే పరిజ్ఞానాన్ని టెక్నికల్ సిబ్బంది అన్వయించుకుని ధాన్యం కొనుగోలును విజయవంతం చేయాలన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతులకు కనీస మద్దతు ధరను కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో గతంలో మాదిరిగా కాకుండా ఒకే కంపెనీ వారు మిల్లుల వద్ద, కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతాన్ని పరీక్షించే పరికరాలను ట్యాలిబ్రేషన్ ప్రక్రియ చేపట్టారని, ఇకపై ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్ల వద్ద తేమశాతం పరికరాల్లో వ్యత్యాసాలు ఉత్పన్నం కావని ఆమె స్పష్టం చేశారు. జిల్లాలో 376 రైతు సేవా కేంద్రాలను 219 క్లస్టర్లుగా విభజించామని, ఈ క్లస్టర్‌లో 219 మంది సాంకేతిక సహాయకులను, మరో 219 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను, 66 మంది హెల్పర్లను నియమించామన్నారు. జిల్లా స్థాయిలో ఈ నెల 21, 23 తేదీల్లో సాంకేతిక శిక్షణా తరగతులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ర్యాండమైజేషన్ ప్రక్రియను రద్దు చేసిందని, రైతు తమకు ఇష్టమొచ్చిన రైసు మిల్లులకు తరలించుకుని విక్రయించుకునే వెసులుబాటు ఉందన్నారు. కస్టోడియన్ అధికారులు మిల్లుల వద్ద దిగుమతి ప్రక్రియను పరిశీలించి సకాలంలో వాహనాల రవాణాకు సిద్ధం చేస్తారన్నారు. సచివాలయ సిబ్బంది ధాన్యం రవాణా వాహనాలను జీపీఎస్ కోఆర్డినేటర్ ద్వారా పర్యవేక్షిస్తారన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే

కఠిన చర్యలు తప్పవు

బాణసంచా తయారీ కేంద్రాల్లో వృద్ధులు, మహిళలు, పిల్లలను పనిలో పెట్టుకోకూడదు

సమీపంలో అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలి

సమీక్షలో ఆర్డీవో మాధవి


సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

అమలాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని అమలాపురం ఆర్డీవో కె.మాధవి హెచ్చరించారు. ఆర్డీవో కార్యాలయంలో బుధవారం దీపావళి పండుగ నేపథ్యంలో భద్రతా అంశాలపై రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, కార్మికశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ దీపావళి బాణసంచా తయారీదారులు, విక్రయదారులు సురక్షితమైన వాతావరణంలో విక్రయాలు జరుపుకునేలా అన్ని ప్రామాణిక భద్రతా చర్యలను చేపట్టాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో వృద్ధులు, మహిళలు, బాలలతో పనులు చేయించరాదని, శిక్షణ పొందిన కార్మికులను మాత్రమే నియమించుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఇసుక, నీరు, అగ్నిమాపక పరికరాలు విధిగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనుమతించిన ప్రదేశాల్లో నిర్దేశించిన సమయాల్లో మాత్రమే బాణసంచా విక్రయాలను జరుపుకోవాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్, పోలీసు అధికారులు విస్తృత స్థాయి తనిఖీలు చేపట్టాలన్నారు. అక్రమంగా బాణసంచా నిల్వచేసిన, తయారుచేసినా పోలీసు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించాలని ప్రజలను ఆర్డీవో కోరారు. సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి ప్రసాద్, అధికారులు, బాణసంచా విక్రయదారులు పాల్గొన్నారు.





మరపురాని నటుడు 'మాడా'

- సినీనటుడు మాడా వెంకటేశ్వరరావుది మన దుళ్ల
- ఇంజనీర్ నుంచి యాక్టర్ దాకా ప్రస్థానం
- హాస్యమిళితమైన నటనలో మేటి
- నేడు వర్ధంతి

హాస్యనట చక్రవర్తుల్లో ఒకరు మాడా వెంకటేశ్వరరావు. ఆయన స్వగ్రామం కడియం మండలం దుళ్ల. ఇంజనీరింగ్ చదివినా నటనపై ఆసక్తితో సినీరంగంలోకి వెళ్లి రాణించారు.

(కడియం-ఆంధ్రజ్యోతి)

సినీజగత్‌కు హేమాహేమీలను అందించిన ఘనత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సొంతం. ఎంతోమంది నటీనటులు ఇక్కడి నుంచే సినీరంగంలోకి వెళ్లారు. తెలుగు చలనచిత్ర సీమలో తమకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. వారిలో ఒకరు మాడా వెంకటేశ్వరరావు. 'చూడు పిన్నమ్మ-పాడు పిల్లాడు' సాంగ్‌తో ఉభయ తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన నటుడు మాడా వెంకటేశ్వరరావు. ఆయన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని కడియం మండలం దుళ్ల గ్రామం. మాడా పేరు చెబితే 'బాయా' అనే డైలాగు, 'చూడు పిన్నమ్మ పాడు పిల్లాడు' అనే పాట వెంటనే గుర్తుకొస్తుంది. దుళ్ల గ్రామంలో మాడా వీరభద్రుడు-అమ్మన్న దంపతులకు రెండో సంతానంగా 1935 జూన్ 4న మాడా వెంకటేశ్వరరావు జన్మించారు. మాడా వెంకటేశ్వరరావు కుటుంబం పెద్దదే. ఆయనకు అన్నయ్య, చెల్లి, ముగ్గురు అక్కలు ఉన్నారు. మాడా వెంకటేశ్వరరావు బాల్యం అంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సాగింది. ఆయన ప్రాథమిక విద్య, హైస్కూల్, రాజమహేంద్రవరం, మండపేటల్లో సాగింది. అటుపై కాకినాడలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు.




మాడా వెంకటేశ్వరరావు.. దుళ్లలో ఉన్న ఇల్లు

ఇంజనీరింగ్ పట్టా పొందిన తర్వాత ఇంజనీరుగా జీవితం ప్రారంభించారు. ఆ వెంటనే ఆయనకు వివాహం జరిగింది. నలుగురు కుమార్తెలు కూడా. అయితే చిన్ననాటి నుంచి నాటకరంగంపై మక్కువ పెంచుకున్న మాడా ఇంజనీర్‌గా ఉంటూనే సినీరంగంలో ప్రయత్నాలు చేశారు. ఆయన ప్రయత్నం ఫలించి 'సుడిగుండాలు' సినిమాలో ఆయనకు అవకాశం దక్కింది. అప్పటి నుంచి సినీనటునిగా తనదైన శైలిలో పాత్రలు పోషిస్తూ తెలుగు ప్రేక్షకులను అలరించారు. ఒక ఇంజనీర్ తనకున్న లక్ష్యాన్ని సాధించడంలో సఫలమై నటుడిగా కూడా సక్సెస్ అయ్యారు. తెలుగు సినిమాలో బృహన్నల పాత్రలు చేయడంలో మాడాకు మరెవరూ సాటిలేరు. హాస్యాన్ని పండిస్తూ బృహన్నల హావభావాలను వ్యక్తపరచడంలో మాడా వెంకటేశ్వరరావుది విభిన్నమైన శైలి. తన అద్భుతమైన నటనతో హాస్యమిళితమై ప్రేక్షకులను అలరింపజేశారు. కథ సీరియస్‌గా నడుస్తున్న కొన్ని ఘట్టాల్లో మాడా ఎంట్రీతో హాస్యాన్ని పండించే పాత్రలు అనేకం రంజిపజేశాయి. మాడా 'సుడిగుండాలు' సినిమా మొదలు వెయ్యికి పైగా సినిమాలు నటించి తనదైన శైలి సృష్టించారు. జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన నటుల్లో మాడా ఒకరు. ఆయన వర్ధంతి నేడు.



పోలియోకు సెలవు!

పోలియో అంటేనే.. ఒక విషాద జీవితం. బతికినన్నాళ్లూ కష్టాలతోనే కొనసాగాలి. ఇటు కన్నవారికీ, అటు పోలియోతో బాధపడేవారికీ నరకమే. కళ్లనిండా దుఃఖాన్ని మోస్తూ బతకాలి. ఈ మహమ్మారిని సమూలంగా నిర్మూలించడానికి ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల తరబడి కృషి సాగింది. పోలియో చుక్కలు కచ్చితంగా వేయడం ద్వారా ఈ మహమ్మారి నుంచి భారత్ కూడా బయటపడింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పోలియో కేసులు నమోదు కావడం లేదు. ఏటా పోలియో చుక్కల కార్యక్రమం క్రమంతప్పకుండా జరుగుతోంది. నిజంగా ఈ పోలియో వ్యాధిని నిర్మూలించడం మానవాళి సంఘటితంగా సాధించిన గొప్ప విజయం. గురువారం ప్రపంచ పోలియో దినం సందర్భంగా కథనం.

- గత 15 ఏళ్లుగా కేసులు జీరో
- పల్స్ పోలియోతో సాధించిన విజయం ఇది
- ఫలించిన ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల కృషి
- చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం అందరి బాధ్యత

(రాజమహేంద్రవరం అర్బన్/ ముమ్మిడివరం -ఆంధ్రజ్యోతి)

పోలియోను పూర్తిగా పారదోలినట్టు వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే ప్రకటించింది. గత కొన్నేళ్లుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదుకావడం లేదు. నిరంతరాయంగా పోలియో చుక్కల కార్యక్రమం ద్వారానే ఇది సాధ్యపడిందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 2014లోనే మన రాష్ట్రంతో పాటు దేశం మొత్తం పోలియోఫ్రీగా నిర్ధారిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ధ్రువీకరణ ఇచ్చింది. అయితే ఇప్పటికీ కొన్ని దేశాల్లో పోలియో కేసుల నమోదు ఉండడంతో మన దేశంలో కూడా ముందు జాగ్రత్తగా పోలియో చుక్కల కార్యక్రమాన్ని విధిగా నిర్వహిస్తూ వస్తున్నారని చెబుతున్నారు. ప్రతి ఏటా జనవరి నెలలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తున్నారు. గర్భిణీలకు ముందస్తుగా చేసే రక్త పరీక్షల సందర్భంలో కూడా ఎలాంటి పోలియో అనుమానిత కేసులు నమోదు కావడం లేదని వైద్య, ఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. ఏటా జనవరి నెలలో పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభమైన తర్వాత దాదాపు నెలరోజులపాటు ఐదేళ్లలోపు చిన్నారులందరినీ వెతికి మరీ వారికి చుక్కలు వేస్తున్నారు. అన్ని ముఖ్య కూడళ్లలో, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో సైతం స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ఎక్కడా పోలియో కేసు నమోదు కాకపోవడానికి ప్రధాన కారణమని వైద్యాధికారుల అభిప్రాయం. పల్స్‌పోలియోకు ముందు ఇంటింటి సర్వే చేయడంతోపాటు చిన్నారులు ఉన్న ఇంటిని చాక్‌పీస్‌తో మార్కు చేస్తారని, ఎవరైనా ఊరికి వెళితే వాళ్లు వచ్చేవరకూ ఫాలోఅప్ చేస్తూనే ఉంటారని, దీనివల్లే పోలియో నిర్మూలన సాధ్యమైందని వారు చెబుతున్నారు. ఇటు ప్రభుత్వం, అటు స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడమూ ఈ మహమ్మారిని తుదముట్టించడానికి దోహదపడింది. ఇక గతంలో పల్స్ పోలియో కార్యక్రమం ఏడాదికి రెండుసార్లు జరిగేది. తర్వాత జనవరి నెలలో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇదికాకుండా ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో నిర్మూలనకు రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం ద్వారా సచివాలయాల్లో నెలలో ప్రతీ బుధవారం, శనివారం జరుగుతోంది. పోలియో ఇమ్యునైజేషన్‌లో రెండు రకాల వ్యాక్సిన్లు వేస్తారు. ఓపీవీ (ఓరల్ పల్స్ పోలియో) చుక్కలు పుట్టినబిడ్డకు వెంటనే, ఆరువారాలు, పది వారాలు, 14 వారాలకు వేస్తారు. ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్)ను 6 వారాలు, 14, 9 నెలలు నిండిన తరువాత పిల్లలకు వేస్తారు. కలుషితనీరు తాగడం, బహిరంగ మలవిసర్జన వల్ల పరిసరాలు, మంచినీరు కలుషితమై ఈ పోలియో వ్యాధి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో గత 15 ఏళ్లుగా ఒక్క పోలియో కేసు నమోదుకాలేదు. దేశంలోనూ కేసులు లేకపోవడంతో పోలియో రహిత దేశ జాబితాలో ఉంది.



గిరిజన గ్రామం.. ఊరంతా ఉద్యోగులే!

ఆర్కూర్ గ్రామం విశిష్టత

సాధారణంగా ఒక గ్రామంలో ఒకరో ఇద్దరో ప్రభుత్వోద్యోగులుంటారు. మహా అయితే పట్టుమని పదిమంది కూడా ఉండొచ్చు. కానీ ఆ గిరిజన గ్రామంలో ఏకంగా వంద మందికిపైగా ప్రభుత్వ కొలువులు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. కూనవరం మండలం ఆర్కూర్ గిరిజన గ్రామంలో సుమారు 100కు పైగా గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాయ కష్టంతోపాటు ఆగిరిజన గ్రామానికి చదువు విలువ తెలుసు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీలు పడి మరీ విజయం సాధిస్తున్నారు.

మొదట గురువు ఆయనే..

ఆ గ్రామంలో మొదటగా ప్రభుత్వ ఉద్యోగం చేసింది చిచ్చడి రాజయ్య అని ఆర్కూర్ గ్రామానికి చెందిన గిరిజనులు చెప్పారు. తొలి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఆయన ఉద్యోగం నిర్వహించారని రూ.3.75 పైసలతో అప్పట్లో జీతం తీసుకునేవాడని చెప్పేవారు. ఆయన స్ఫూర్తితోనే ఇక్కడ యువత ఉద్యోగం చేస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తిగా ఇప్పుడు ఆ గ్రామంలో 43 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఇక పోలీస్ శాఖలో ఎనిమిది మందికిపైగా ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో మహిళా పోలీసులు ఉన్నారు. వెటర్నరీ డిపార్టుమెంట్‌లో ఏడుగురు, హెల్త్ డిపార్టుమెంట్‌లో 12 మంది, అంగన్‌వాడీలో ఇద్దరు, ఆర్టీసీలో ఒకరు, ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లో ఇద్దరు, ఫీల్డు అసిస్టెంట్లుగా ముగ్గురు, స్కూల్ ఆఫీస్ వర్కర్లుగా ఐదుగురు, పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఇద్దరు, బ్యాంకులో ఒకరు, వెల్ఫేర్ అసిస్టెంట్లుగా ఇద్దరు, డిజిటల్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్లుగా ఇద్దరు, అగ్రికల్చర్ సెరీ కల్చర్‌లో ఇద్దరు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా ఒక్కరు, రెవెన్యూ డిపార్టుమెంట్‌లో ఇద్దరు చేస్తున్నారు. వీరితోపాటు వివిధ సచివాలయాల్లో ఉద్యోగులుగా ఈ గ్రామానికి చెందినవారు ఉండడం గమనార్హం. ఇంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న ఆర్కూర్ గ్రామం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. అంతేకాకుండా ఈ గ్రామానికి చెందిన రాబోయే యువత సైతం ఉద్యోగాల వేటలో ఉన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

నా ఊరే నాకు ఆదర్శం..

- పాయం కన్నారావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు



మా ఊరులో ఇంత మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండడం గర్వకారణం. నేను పేదరికం వల్ల రాత్రి బడిలో అక్షరాభ్యాసం చేశా. అనంతరం గురుకుల పాఠశాలకు ఎంపికై అక్కడి నుంచి ఉపాధ్యాయులకు కావాల్సిన అర్హత సాధించా. ఇప్పుడు మా ఊరులో వందమందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులున్నారు. రాబోయే యువత కూడా ఇదే మార్గంలో వెళ్లాలి.

- ఆంధ్రజ్యోతి/కూనవరం



సోలార్ ప్యానళ్లు పట్టుకుపోవడంతో ఖాళీగా ఉన్న స్టాండ్

మూలకు చేరిన..

సాగర సమాచార కేంద్రం

- తుఫానులు, మత్స్య సంపద లభ్యతపై సమాచారం కోసం ఏర్పాటు
- నిరుపయోగంగా పరికరాలు
- మత్స్యకారులకు అందని సేవలు



సాగర సమాచారాన్ని తెలిపే డిస్‌ప్లే బోర్డు

తొండంగి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మత్స్యకారలకు తుఫాను హెచ్చరికలు చేరవేసేందుకు, మత్స్య సంపద లభ్యత గురించి సమాచారం ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన సాగర సమాచార వ్యవస్థ(ఓషన్ ఇన్ఫర్మేషన్ సిస్టం) మూలకు చేరి నిరుపయోగంగా మారింది. తొండంగి మండలం తీరప్రాంత గ్రామమైన దానవాయిపేటలో గతంలో దీన్ని ఏర్పాటు చేశారు. దీనిద్వారా అందే సమాచారాన్ని 100 నుంచి 150 కిలోమీటర్ల మేర సముద్రంలో వేట సాగించే మత్స్యకారలకు అందించే అవకాశం ఉంది.దీని కోసం బోట్లలో ఉన్న ప్రత్యేక పరికరాలు వారికి ఉపయోగపడేవి. తుఫానుల సమయంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను తిరిగి రప్పించేందుకు, వారికి వాతావరణ సమాచారం అందించేందుకు ఈ వ్యవస్థ చక్కగా ఉపయోగపడేది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా మత్స్యకారలకు సేవలు అందేవి. తుఫానుల సమయంలో విద్యుత్ లేకున్నా ఉపయోగపడేలా సోలార్ సిస్టం ద్వారా పనిచేసేలా దీన్ని ఏర్పాటు చేశారు. దీని కోసం భవనంపైన సోలార్ ప్యానళ్లు, బ్యాటరీలు ఏర్పాటు చేశారు. కేంద్రంలో స్క్రీన్‌తో కూడిన డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. కొంతకాలం దీన్ని సక్రమంగా నిర్వహించిన మత్స్యశాఖ మరమత్తు రావడంతో పట్టించుకోవడం మానేసింది. దీంతో విలువైన పరికరాలు నిరుపయోగంగా మారాయి.భవనంపైన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లను కొందరు దొంగిలించుకుపోయారు. మత్స్యకారులకు అత్యం త అవసరమైన ఈ కేంద్రాన్ని తిరిగి తెరిపించాలని, ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న సోలార్ బ్యాటరీలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామికి లక్షతులసీ పూజ దృశ్యం

బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు

- మూడోరోజు సుప్రభాత సేవ, అష్టోత్తర శతకలశాభిషేకం
- వేంకటేశ్వరస్వామి హోమం

ఆత్రేయపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేదమంత్రాలు... మేళతాళ మంగళవాయిద్యాలు.. కళాకారుల ప్రదర్శనలు.. భక్తజన గోవిందనామస్మరణల నడుమ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడోరోజు బుధవారం వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నవనీత హారతి, సంకల్పము, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, విశేష అర్చన, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అష్టోత్తర, శతకళశాభిషేకం స్వా మివారి మూలవిరాట్‌కు లక్షతులసి పూజ, ప్రధా న హోమాలు వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు వేంకటేశ్వస్వామి హోమం, భక్తజనం గోవిందనామస్మరణలు వేద పండితులు నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణ, ఫలపుష్పాలంకరణ, వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రదర్శనల నడుమ స్వామి వారి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా నిర్వహించారు. అనంతరంరాత్రి శ్రీవారు కోదండరామ అలంకరణతో సర్వాంగ సుందరంగా అలంకరించిన హనుమత్‌వాహనంలో ఆశీనులయ్యారు.



స్వామివారి ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



శక్తివేషాలతో అలరిస్తున్న దృశ్యం

భక్తజన గోవిందనామాల నడుమ వేలాది మంది భక్తులు తిరువీధులలో స్వామివారి వాహనసేవలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో ముదునూరివెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు కాయల జగన్నాథం-మంగాదేవి దంపతులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



వాడపల్లి శ్రీవారికి సింహవాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లిలో నేడు..

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, తిరుప్పావడ సేవ, యోగనారసింహ అలంకరణతో శ్రీవారి సింహవాహన సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

అబ్బో.. ఎన్ని తేనెపట్లో

- కొమ్మ.. కొమ్మకూ ఒకటి
- జేఎన్టీయూకేలోని ఒకే చెట్టుకు అనేక తేనెపట్లు

జేఎన్టీయూకే, అక్టోబరు 23: సాధారణంగా తేనెపట్లు అటవీ ప్రాంతాల్లోని చెట్లకు ఎక్కువగా పడుతుంటాయి. పెద్ద రాళ్లకు, భవనాలకు కూడా పట్టడమే కాకుండా వాటిలో ఉండే తేనె చాలా నాణ్యతగా ఉంటుంది. ఎక్కడైనా కానీ ఒకటి లేదా రెండు తేనెపట్లు మాత్రమే పట్టడం చూస్తాం. కానీ కాకినాడ జేఎన్టీయూకే ఆవరణలోని ఫార్మసీ విభాగం ఎదురుగా బాలికల వసతిగృహం పక్కన గల ఓ మర్రి చెట్టు కొమ్మలకు ఎక్కువ తేనెపట్లు పట్టాయి. దీంతో అబ్బో ఆ చెట్టుకు ఎన్ని తేనె పట్లు పట్టాయో అని చూసిన ప్రతిఒక్కరూ ఆశ్చర్యపోతున్నారు. కొంతమంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, వర్సిటీకి వివిధ పనుల మీద బయటి నుంచి వచ్చేవారు, ఆ చెట్టు పక్కనున్న రోడ్డుపై వెళ్లేటప్పుడు ఆ తేనెపట్లులను ఆగి మరీ ఆశ్చర్యంగా చూస్తున్నారు.






దేవాలయాల్లో కార్తీక మాస పూజలు, ఏర్పాట్లపై దేవదాయ శాఖ ఉప కమిషనరు సమీక్ష

పోర్టు సిటీ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాలయాల్లో ఏర్పాట్లపై దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు సమీక్షించారు. కాకినాడ రామారావుపేటలోని ఆయన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని శివాలయాల ఈవోలు, జిల్లా అధికారులు, కార్యాలయాల పర్యవేక్షకులు హాజరయ్యారు. ఆయా దేవాలయాల్లో భక్తుల రద్దీ, తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఉప కమిషనరు కార్యాలయ పర్యవేక్షకుడు వి.సోమరాజు, జిల్లా దేవాలయాల శాఖాధికారి అల్లు భవాని పాల్గొన్నారు.



వ్యానెక్కిన పడవ

నీటిలో ఉండాల్సిన పడవ వ్యానెక్కింది. కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని తీర ప్రాంత గ్రామమైన గోపాలపట్నం నుంచి వేరే ప్రాంతంలో వేట సాగించేందుకు మత్స్యకారులు పడవను బుధవారం వ్యానుపై తీసుకు వెళ్తున్నారు. దీనిని దారి పొడవునా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

- తొండంగి (ఆంధ్రజ్యోతి)

ప్రముఖ వైద్యుడు డాక్టర్ తేతలి కన్నుమూత



వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ వైద్య విధాన పరిషత్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాజీ డీసీహెచ్ఎస్, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ (రిటైర్డు) డాక్టర్ తేతలి వెంకటేశ్వరరావు (79) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొద్ది రోజులుగా ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన రాజమహేంద్రవరం దానవాయిపేటలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సివిల్ సర్జన్‌గా గోదావరి జిల్లాల్లో ఆయనకు ఎంతో పేరుంది. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వైద్యుడిగా పని చేసిన సమయంలో వేలాది మందికి ప్రాణదానం చేసి పేదల హృదయాల్లో దేవుడిగా నిలిచారు. 1945 ఆగస్టు 29న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జన్మించిన వెంకటేశ్వరరావు కర్నూలు వైద్య కళాశాలలో మెడిసిన్ చదివారు. అనేక హోదాల్లో పనిచేశారు. 1993లో సివిల్ సర్జన్‌గా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఆయనమంచి వైద్య సేవలందించడం ద్వారా అనతికాలంలోనే ప్రజలకు దగ్గరయ్యారు. డాక్టర్ తేతలి మరణవార్త తెలుసుకున్న అనేక మంది వైద్యులు, నగర ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారంరాజమహేంద్రవరం కోటిలింగాలు కైలాసభూమిలో అంత్యక్రియలు జరుగుతాయి.



వాటర్ ట్యాంక్ ఎక్కి దూకేస్తానని బెదిరిస్తున్న శ్రీనివాస్

నాలుగు గంటలు... హైడ్రామా

పెద్ద చెరువు ఆక్రమణదారులకు పంచాయతీ నోటీసులు జారీ చేయడంపై నిరసన

వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యకు పాల్పడతానని యువకుడి బెదిరింపు

అధికారులు, పోలీసుల హామీతో దిగివచ్చిన వైనం

మండపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలో పంచాయతీకి చెందిన పెద్ద చెరువు ఆరు ఎకరాల్లో విస్తరించి ఉంది. దాని చుట్టూ వున్న గట్టును ఆక్రమించుకుని 46 మంది నివాసం ఉంటున్నారు. ఈ చెరువును రూ.2.5 కోట్లతో పార్కుగా అభివృద్ధి చేసేందుకు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలు తొలగించాలంటూ వారికి పంచాయతీ ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఆక్రమణదారుల్లో 16 మంది ఇప్పటికే ప్రభుత్వం నుంచి స్థలాలు పొందారు. మరో 30 మందికి ప్రభుత్వ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయించారు. అయితే చెరువు గట్టు ఇళ్లకు సంబంధించి ఎటువంటి సంబంధం లేని గ్రామానికి చెందిన యువకుడు రామిశెట్టి శ్రీనివాస్ బుధవారం ఉదయం 7.30 గంటలకు చెరువు గట్టున ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కాడు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చినందుకు నిరసనగా ఆత్మహత్యకు పాల్పడతానంటూ హైరానా చేశాడు. 11 గంటల వరకు హైడ్రామా నడిచింది. వాటర్ ట్యాంకు పైనుంచి దూకేస్తానని, ఆక్రమణలు తొలగించమంటూ తనకు పంచాయతీ నుంచి లేఖ కావాలని పట్టుబట్టాడు. దీంతో లేఖ ఇచ్చేందుకు పంచాయతీ అధికారులు ముందుకొచ్చారు. మండపేట రూరల్ ఎస్ఐ అక్కడకు చేరుకుని ట్యాంకుపై ఉన్న యువకుడిని కిందకు దింపే ప్రయత్నం చేశారు. పంచాయతీ సిబ్బంది, స్థానికులు పోలీసులు సంయుక్తంగా చేసిన ప్రయత్నం ఫలించింది. ఉదయం 11 గంటలకు అధికారులు, స్థానికుల కోరిక మేరకు యువకుడు వాటర్ ట్యాంకు పైనుంచి దిగి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కిందికి దిగివచ్చి అనంతరం యువకుడు విలేకరులతో మాట్లాడాడు. తన సమీప బంధువు, వరుసకు పిన్నికి చెరువు గట్టున ఇల్లు ఉందని, దానిని తొలగిస్తామని పంచాయతీ నోటీసు ఇవ్వడంతో తాను వాటర్ ట్యాంకు ఎక్కానని చెప్పాడు.

కాగా పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో యువకుడిని మండపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సుదీర్ఘ కాలం నుంచి తామంతా చెరువు గట్టుపై సొంతంగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, పార్కు నిర్మాణం కోసం వాటిని తొలగిస్తే తమకు దారేంటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు ఎకరాల్లో విస్తరించి వున్న చెరువు ఎకరంపైగా ఆక్రమణలకు గురైందన్నారు. సర్వే అనంతరం పార్కు నిర్మాణం కోసం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని, ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అంతేతప్ప ఇందులో ఎటువంటి రాజకీయ దురుద్దేశం లేదని చెప్పారు.



శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



సామర్లకోట రైల్వే స్టేషన్లో హెల్ప్ డెస్క్

'దానా' తుఫాన్ ఎఫెక్ట్

రైల్వే హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

సామర్లకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం వెంబడి 'దానా' తుఫాను ప్రభావంతో కొన్ని రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని తీవ్ర ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రయాణికులు ఎప్పటికప్పుడు సత్వర సమాచారం తెలుసుకునేందుకు విజయవాడ డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు రైల్వే పీఆర్వో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు సమాచారం అందింది.

స్టేషన్	హెల్ప్ డెస్క్ నెంబరు
సామర్లకోట	0884-2327010
రాజమహేంద్రవరం	0883-2420541
తుని	08854-252172
తాడేపల్లిగూడెం	08818-226162
భీమవరం టౌన్	78159 09402
ఏలూరు	75693 05268
అనకాపల్లి	75693 05669
గూడూరు	0862-4250795
నిడదవోలు	08813-223325
ఒంగోలు	8592280306
తెనాలి	86442 27600
గుడివాడ	78159 09462,
నెల్లూరు	0861-2345863
విజయవాడ	0866-2576924



నూతన కార్యవర్గ సభ్యులతో ఏపీ ఎన్జీవో నాయకులు

ఏపీ జీఎన్ఏ జిల్లా అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ (ఏపీ జీఎన్ఏ) అధ్యక్షురాలిగా బూరిగ విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా బోడే రాణి, కార్యదర్శిగా గట్టు ప్రమోద, కోశాధికారిగా కాకి వెంకటపరమేశ్వరి విజయం సాధించారు. కాకినాడ జీజీహెచ్‌లోని రేడియాలజీ సెమినార్ హాల్‌లో బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏపీ ఎన్జీవో నాయకులు బలపరిచిన బూరిగ విజయలక్ష్మి తన ప్రత్యర్థి ధనలక్ష్మిపై 39 ఓట్ల ఆధిక్యతతో అధ్యక్షురాలిగా గెలుపొందారు. ఉపాధ్యక్షురాలిగా బోడే రాణి తన ప్రత్యర్థి అంజలి శ్రీవల్లిపై 49ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కార్యదర్శిగా పోటీ చేసిన గట్టు ప్రమోద తన సమీప ప్రత్యర్థి కెల్లా నళిని జయంతిపై 34 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కోశాధికారి పదవికి జరిగిన ఎన్నికలో కాకి వెంకటపరమేశ్వరి తన ప్రత్యర్థి మచ్చా సుజాతపై 91 ఓట్ల భారీ విజయం సాధించింది. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా విప్పర్తి ఇందిర, కళ్యాణపుదేవి, జి.వీరలక్ష్మి, బత్తుల అక్కమ్మ, ఎం.సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు జి.రామ్మోహన్‌రావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, ఎ.సత్తిరాజు అభినందించారు.

సెంట్రల్ జైలులో తనయుడితో మాజీ మంత్రి విశ్వరూప్ ములాఖత్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23: కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన వలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో అరెస్టు అయి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న పినిపే శ్రీకాంత్‌తో అతడి తండ్రి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ములాఖత్ అయ్యారు. బుధవారం ఆయన సెంట్రల్ జైలుకు చేరుకుని ఇంటర్వ్యూ పెట్టుకుని సుమారు 30 నిమిషాల పాటు శ్రీకాంత్‌తో మాట్లాడినట్టు జైలు అధికారులు తెలిపారు. ఆయన జైలు వద్దకు వస్తున్నట్టు ఎవరికీ సమాచారం లేకుండానే వచ్చి వెళ్లారు. స్థానిక వైసీపీ నాయకులకు కూడా సమాచారం లేకపోవడం గమనార్హం.

తపోవనంలో కార్తీక పూజలకు ఏర్పాట్లు

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఆధ్యాత్మిక పీఠం, పవిత్ర తాండవ నది పరివాహక కాశీక్షేత్రం తుని శ్రీసచ్చిదానంద తపోవనంలో కార్తీక మాసంలో నిత్య శివపూజలకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు స్వామీజీ శిష్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 5న చతుర్థి నాడు శ్రీ గణేష్ సపర్య, నవంబరు 12 మంగళవారం ఏకాదశి నాడు దివ్యనామ సంకీర్తన, 13న బుధవారం ద్వాదశి నాడు శ్రీ రాధా కల్యాణం, 14న గురువారం విశ్వేశ్వర మహాభిషేకం, చతుర్దశి నాడు లక్ష తులసి అర్చన, 15న పూర్ణిమ నాడు శ్రీదేవి కుంకుమార్చన, లక్షపర్తి ప్రదీపోత్సవం, శ్రీరాధా జన్మోత్సవం, జ్వాలాతోరణం, మహారాసోత్సవం, మహాదీపోత్సవం, 28న గురువారం మహా ప్రదోషం, డిసెంబరు 1 ఆదివారం భానువార అమావాస్య, మహాసౌర అరుణ సపర్య, కౌముద్యుత్సవం నిర్వహిస్తారు. కార్తీక సోమవారాల్లో పగలు విశేష ఫలపంచామృత సహిత మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకము, ప్రదోష కాలంలో శ్రీరుద్రక్రమార్చన అత్యంత వైభవోపేతంగా జరుగుతాయి. పరమ పవిత్రమైన కార్తీక మాసంలో తపోవనంలో పూజలు చేసేందుకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 8106983711 నెంబరును సంప్రదించాలని కోరారు.

29న ఉద్యోగ క్రీడాకారుల జిల్లా స్థాయి ఎంపికలు

కాకినాడ అర్బన్, అక్టోబరు 23: రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడల్లో పాల్గొనడానికి జిల్లా స్థాయి మహిళ, పురుష క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 29న కాకినాడ డీఎస్ఏ మైదానంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్‌లతో ఎంపికలు నిర్వహిస్తారు. ఆసక్తి గల ఉద్యోగ క్రీడాకారులు అర్హత ధ్రువపత్రాలతో ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోగా కాకినాడ డీఎస్ఏ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం గ్రామ శివారు మామిడితోటలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. 40 నుంచి 45ఏళ్ల వయసు ఉంటుందని, ఎత్తు 5.8 అడుగులతో చామనఛాయ రంగుతో ఉండి నీలం రంగు జీన్ ఫ్యాంటు, కాఫీ రంగు షర్టు వేసుకున్నాడన్నారు. గుండు ఉండడంతో సత్యదేవుని దర్శనానికి వచ్చి తలనీలాలు సమర్పించి ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు అన్నవరం ఎస్ఐ 9440796571 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.





రెండో రోజు దీక్షా శిబిరంలో శివగణేష్, సూర్యచంద్ర (పైన)

బాధితులతో మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు (కుడి)

గుమ్మళ్లదొడ్డిలో ఉద్రిక్తత

» ప్రధాన రహదారిపై బాధితుల బైఠాయింపు » రెండో రోజుకు నిరవధిక నిరాహార దీక్ష

గోకవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామ సమీపంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమను మూయించాలని డిమాండు చేస్తూ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక సేవా కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర స్థానికులతో కలిసి చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారం రోజుకు చేరుకుంది. వారికి మహిళలు, విద్యార్థులు, చిన్నారులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలుపుతున్నారు. మా ఆరోగ్యానికి హాని కలిగించే ఈ ఫ్యాక్టరీ మాకొద్దు అని చిన్నారులు ప్లకార్డులు చేతబూనారు. శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ పరిశ్రమ అవసరమా? వేలాది మంది ప్రజల ఆరోగ్యం ముఖ్యమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానికులు, చుట్టుపక్క గ్రామాల ప్రజల అభీష్టం మేరకు పరిశ్రమను ఏర్పాటు చేశారా అని నిర్వాహకుల తీరును ఎండగట్టారు. కాగా పరిశ్రమ నిర్వహణను వ్యతిరేకిస్తూ భారీ సంఖ్యలో బాధితులు రాజమహేంద్రవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వందలాది మంది ప్రధాన రహదారిని దిగ్బంధించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిశ్రమను ముట్టడించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఒకానొక సమయంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసుల జులుం నశించాలి అంటూ ఆందోళనకారులు నినాదాలతో హోరెత్తించారు. దీక్షా శిబిరాన్ని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ రామచంద్రరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం ఇన్‌చార్జి అధికారి పి.ప్రదీప్‌కుమార్ బుధవారం సందర్శించారు. పరిశ్రమ వల్ల గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు మాట్లాడుతూ ఇక్కడి ప్రజల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినప్పటికీ ఇవ్వకపోవడంపై అధికారుల తీరును బాధితులు తప్పుబట్టారు.

కారుని వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

ఒకరు మృతి, నలుగురికి గాయాలు

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారుని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారును కాకినాడ జిల్లా తుని మండలం జగన్నాథగిరి వద్ద రోడ్డు పక్కన ఆపారు. అందులో వున్న ఐదుగురు కారు దిగి మూత్ర విసర్జన చేస్తుండగా చెన్నై నుంచి ఒడిశా వెళ్తున్న లారీ వెనుక నుంచి అతి వేగంగా కారును ఢీకొట్టింది. పైలా వెంకట సత్య అప్పలస్వామి (66) అక్కడికక్కడే మృతి చెందగా గోవిందరాజులు, తారక్, కొండలరావు, రమణ తీవ్రంగా గాయపడ్డారు. భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే సిబ్బంది వచ్చి క్షతగాత్రులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. మృతి చెందిన వెంకట సత్య అప్పలస్వామి వెటర్నరీ డాక్టర్ కాగా, గాయపడిన నలుగురూ అతడికి సన్నిహితులు. వీరు విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నట్టు తెలిసింది. లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి చెప్పారు.



(మృతుడు) అప్పల స్వామి (పాత చిత్రం)





ప్రమాద స్థలంలో లారీ (పైన) కారుని క్రేన్‌తో తొలగిస్తున్న హైవే సిబ్బంది (కింద)

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అదృశ్యం



దేవీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పూడిపల్లి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సోయం శ్రీసౌమ్య అదృశ్యమైంది. ఈ నెల 21వ తేదీన సచివాలయానికి అని చెప్పి వెళ్లిన శ్రీసౌమ్య ఇంటికి తిరిగి రాలేదని ఆమె తల్లి పార్వతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేశారు. శ్రీసౌమ్య ఎవరికైనా ఎక్కడైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సీపీఎం సీనియర్ నాయకుడు సత్యనారాయణ హఠాన్మరణం



సత్యనారాయణ (పాత చిత్రం)

వీఆర్ పురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు, ఉద్యమ నేత పూనెం సత్యనారాయణ (54) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. బుధవారం తమ పొలంలో పనులను పర్యవేక్షించేందుకు దంపతులిద్దరూ నూతిగూడెం వెళ్లారు. పనులను చూస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అక్కడి నుంచి రేఖపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యులు కోతులగుట్ట ఆసుపత్రికి రిఫర్ చేయగా వెంటనే అంబులెన్స్‌లో అక్కడికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ప్రస్తుతం రేఖపల్లి సర్పంచ్. సత్యనారాయణ మరణ వార్త తెలుసుకున్న స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు ఆయన మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్యనారాయణ రెండుసార్లు పెద్దమట్టపల్లి పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. ప్రజా సమస్యలపై అలుపెరగని ఉద్యమాలు, పోరాటాలు చేశారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

అంబాజీపేట, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జీవీ సరోవర్ అన్నారు. మాచవరం, ఇరుసుమండ, నందంపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ఆయన పరిశీలించారు. ఈనెల25 వరకు క్యాంపులను నిర్వహించనున్నట్లు చెప్పారు.

టీడీపీ నాయకుల పరామర్శ

ఐ.పోలవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న నీటిపంపిణీ సంఘం మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు సాగిరాజు సూరిబాబురాజును బుధవారం పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. తాడి నరసింహారావు, బండారు వీరబాబు, దాట్ల బాబు, పాయసం చిన్ని, యాళ్ల ఉదయ్ పరామర్శించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఉప్పలగుప్తం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పల్లె పండుగలో భాగంగా విలసవిల్లి, సింగరాయపాలెం, నంగవరం గ్రామాల్లో సీసీ రహదారులకు బుధవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఆయా గ్రామాల్లో సత్వరం పరిష్కరించాల్సిన సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు సలాది ఊర్మిళాసతీష్, పెయ్యల రాజ్‌కుమార్, జిన్నూరి వెంకటేశ్వరరావు, చిక్కం జంగమయ్య, ఎంపీటీసీ సలాది సురేఖావాణి, టీడీపీ గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు నందుల సత్తిరాజు, కాశిన వీరవెంకటసత్యనారాయణ, మంచెం బుజ్జి, శీలం భాస్కరరావు, గుర్లింక చిన్నా, దొడ్డిపట్ల దుర్గారావు, కూటమి నాయకులు ఆకుల సూర్యనారాయణమూర్తి, గొలకోటి సత్తిరాజు, నాగిరెడ్డి సత్తిబాబు, గుత్తుల నాగేశ్వరరావు, కంకటాల రాము తదితరులు పాల్గొన్నారు.


విలసవిల్లిలో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఎమ్మెల్సీగా రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపిద్దాం

మలికిపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో శాసనమండలికి పంపిద్దామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో నిర్వహించిన పట్టభద్రుల ఓట్ల నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఉమ్మడి ఏజెండాగా రాజశేఖర్‌ను ముందుకు తీసుకువెళ్లడమేనని అన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ పార్టీలో కష్టపనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందనడానికి రాజశేఖర్ నిదర్శమన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్డీఏకు పటిష్టమైన నాయకత్వం ఉందని, అదే స్ఫూర్తి, అదే ఐకమత్యం కొనసాగిస్తూ ప్రణాళికాబద్ధంగా పనిచేసి రాజోలు నియోజకవర్గంలో 15వేల పట్టభద్రుల ఓట్లను నమోదు చేయించాలని కోరారు. ఎమ్మెల్సీ వెంపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ కార్యకర్తలంతా విశేష కృషి సల్పి అత్యధికంగా ఓట్ల నమోదు చేయించాలని కోరారు. రాజశేఖర్‌ను, ఎంపీ, ఎమ్మెల్యేలను కార్యకర్తలు సన్మానించారు. సభలో మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, పార్టీ మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మొల్లేటి శ్రీనివాస్, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, సూరిశెట్టి శ్రీనివాస్, కె.కన్నయ్య, మంగెన భూదేవి, చిటికెన రామ్మోహనరావు, చాగంటి స్వామి, తాడి మోహన్, పొన్నాల ప్రభ, ఎం.శ్రీనివాస్, బందెల పద్మ పాల్గొన్నారు.


రాజశేఖర్‌ను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే దేవ

కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేస్తున్న చమురు సంస్థలు


మాట్లాడుతున్న బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌బాబు

ఉప్పలగుప్తం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చమురు అన్వేషణ చేస్తున్న కంపెనీలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని బీఎస్పీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు ఆరోపించారు. సిస్మిక్ సర్వేలో చెమటోడుస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, భద్రత కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఉప్పలగుప్తం అంబేడ్కర్ భవన్‌లో కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాళ్ళ బాబ్జి అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. జిల్లాలో 150మంది కార్మికులు చాలీచాలని జీతాలతో సిస్మిక్ సర్వేలో పని చేస్తున్నారని, కాంట్రాక్టర్లు స్థానికేతరులతో పనిచేయిస్తూ స్థానికులకు అన్యాయం చేస్తున్నారని కార్మిక సంఘం నాయకులు వ్యాఖ్యానించారు. కార్మికుల సమస్యలపై పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో లీగల్ అడ్వైజర్ కోలా త్రిమూర్తులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, యూనియన్ నాయకులు బడుగు సత్యనారాయణ, నామాడి ఆనందకుమార్, జనిపెల్ల రవీంద్ర, మోకా దుర్గారావు, అయితాబత్తుల రామకృష్ణతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కార్మికులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు పింఛన్ అందించి ఆదుకుంటాం


సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ రోగులకు సైతం పింఛన్ అందించి, ఆర్థికంగా ఆదుకోవడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించి అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలోని 15మందికి మంజూరైన రూ.7,47,289 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యని ర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, దాసరి వీరవెంకటసత్య నారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, జాలెం శ్రీనివాసరాజా, పోలిశెట్టి రాజేష్, నూకపెయ్యి ప్రసన్నకుమార్, కొక్కిరి లక్ష్మి, శేరు శ్రీనుబాబు, పబ్బినీడి రాంబాబు పాల్గొన్నారు.

‘కూటమి పాలనలో కుట్రతోనే వైసీపీ నేతల అరెస్టు’

అల్లవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దళితుల, వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కుట్రపూరితంగా కక్షతో అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేస్తుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. బుధవారం అల్లవరంలో మాజీ ఎంపీపీ కొనుకు బాపూజీ అధ్యక్షతన వైసీపీ నాయకులు సమావేశమై విలేకర్లతో మాట్లాడారు. బాపట్ల ఎంపీ నందిగామ సురేష్, మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ అక్రమ అరెస్టులు రాజకీయ కక్షతోనే జరిగాయని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, వైసీపీ నేతలు ఆరోపించారు. కార్యక్రమంలో తిక్కా వెంకటప్రసాద్, సాధనాల వెంకట్రావు, తుట్టేపు బాబి, చింతా రామకృష్ణ, యల్లమల్లి బోస్, పులుసుగంటి గంగాధర్, బొంతు సత్యనారాయణ, కంపాని రాజేష్, నాతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై సదస్సు

అంతర్వేది, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శృంగవరప్పాడులో వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్రాల్లో సమాచార కమిషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయన్నారు. అనంతరం శృంగవరప్పాడు, వీవీ మెరక గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. సర్పంచ్‌లు ఓగూరి రత్నకుమారిబాబులు, రావి నాగ వెంకటలక్ష్మీదేవి త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు, బీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

అప్రోచ్ పనులను ముందుగా పూర్తి చేయండి

పి.గన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గంటిపెదపూడి వంతెన నిర్మాణంలో భాగంగా తొలుత 200మీటర్ల మేర ఉన్న అప్రోచ్ పనులు పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లాల పంచాయ తీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ కాంట్రాక్టర్లకు సూచిం చారు. గంటిపెదపూడిలో ఏఐఐబి నిధులు రూ.49.50కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. వంతెన పనుల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీ లించి, సంతృప్తి వ్యక్తంచేసి కాంట్రాక్టర్లతో పాటు అధికారులకు పలు సూచనలుచేశారు. తొలుత ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు వంతెన డిజైన్, జరుగుతున్న పనులను ఎస్ఈకు వివరించారు. అయితే ఇప్పటి వరకు ఉన్న రూ.19కోట్ల పెండింగ్ బిల్లులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ పీఎస్ రాజు ఎస్ఈని కోరారు. కార్యక్రమంలో ఈఈ రామకృష్ణరెడ్డి, ప్రాజెక్టు ఏఈఈ కొండలరావు తదితరులు ఉన్నారు.


వంతెన పనులను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్

అధ్వాన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని ధర్నా

మామిడికుదురు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం నుంచి పెదపట్నంలంకకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైందని, దానిని ఆధునికీకరించాలంటూ స్థానికులు బుధవారం ధర్నా చేశారు. ప్రధాన రహదారి యావత్తూ గుంతుల మయమై ప్రయాణాలు చేయాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా రోడ్డు అధ్వాన్నంగా తయారైందని, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. రోడ్డును ఆధునికీకరించి తమ కష్టాలను గట్టెక్కించాలని రెండు గ్రామాల ప్రజలు కోరారు.


బి.దొడ్డవరం అధ్వాన రోడ్డుపై ధర్నా చేస్తున్న స్థానికులు

నాయుడు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


స్వామినాయుడుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు

ఉప్పలగుప్తం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సన్నవిల్లి మాజీ సర్పంచ్ గనిశెట్టి వీరాస్వామినాయుడు ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ బుధవారం పరామర్శించారు. నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆయన వెంట సర్పంచ్ చిక్కం జంగమయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, చిక్కం ఉమేష్, గనిశెట్టి రాము, చీకట్ల నాని, మధుర నరసింహమూర్తి, చీకట్ల ఏసు తదితరులున్నారు.


తాచుపాము హల్‌చల్

అయినవిల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలో బుధవారం తాచుపాము హల్‌చల్ చేసింది. పాతాడి వెంకటేశ్వరరావు ఇంట్లోకి తాచుపాము చేరింది. ఐదు రోజులుగా బుసలు వినిపిస్తుండడంతో భయంభయంగానే ఆ కుటుంబం గడిపింది. భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. బీరువా కింద చేరిన తాచుపామును చాకచక్యంగా గణేష్‌వర్మ పట్టుకుని సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు.

మొసలపల్లిలో గ్రామసభ

అంబాజీపేట, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు జె.వెంకటేశ్వరి చెప్పారు. మొసలపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఉపసర్పంచ్ కట్టా గోపాలకృష్ణగోఖలే, ఎంపీటీసీ నూకపెయ్యి సత్యనారాయణ, కార్యదర్శి గౌరీదేవి, వీఆర్వో పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ అర్చకుడు విశ్వనాథం మృతి



అంబాజీపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ అర్చకులు శైవగామ పండితులు పూజ్యం విశ్వనాథం(95) మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆది శైవ శివాచార్య బిరుదాంకితులుగా పేరుగాంచారు. ఆయన శైవాగామ పరీక్షాధికారిగా పలుమార్లు ఆయన వ్యవహరించారు. విశ్వనాథం భార్య సీతామహాలక్ష్మి గతంలోనే మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. విశ్వనాథం మృతి పట్ల ఆదిశైవ అర్చక సంఘం, గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ప్రతిభ

కాట్రేనికోన, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో జరిగిన యూత్ ఫెస్టివల్‌లో చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాల విద్యార్థిని ఎ.దుర్గామహాలక్ష్మి జానపద నృత్యపోటీల్లో తృతీయ స్థానం సాధించినట్టు సెక్రటరీ, కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దుర్గామహాలక్ష్మిని అభినందించారు.

మహిళ అరెస్టు

ఐ.పోలవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యానాం నుంచి హోండా యాక్టివాపై మద్యం బాటిల్స్ తరలిస్తున్న పెదమడి గ్రామానికి చెందిన సానబోయిన దుర్గామహాలక్ష్మిని ఎదురులంక చెక్‌పోస్టు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. 30 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఆర్.మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చేపల బోటులో వ్యక్తి ఆత్మహత్య

ఐ.పోలవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలం భైరవపాలెంకు చెందిన ఓలేటి వీరబాబు(35) మంగళవారం రాత్రి చేపల బోటులో ఆత్మహత్య చేసుకున్నాడు. మేనమామ పెమ్మాడి సముద్రుడు బోటులో తొమ్మిది మంది మత్స్యకారులు ఆదివారం తెల్లవారుజామున సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. అయితే మంగళవారం రాత్రి బోటులో ఉరి వేసుకుని వీరబాబు ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

పుదుచ్చేరి వెళ్లిన పరిపాలనాధికారి

యానాం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యానాం పరిపాలనాధికారి మునిస్వామి పుదుచ్చేరి వెళ్లారు. పాలనాపరమైన అంశాలకు సంబంధించి పుదుచ్చేరిలోని ఉన్నతాధికారులను కలిసేందుకు పుదుచ్చేరి వెళ్లారు. రెండు రోజుల పర్యటనలో వివిధ శాఖల అధికారులతో సమావేశం కానున్నారు.

అగ్నికుల క్షత్రియ సంఘం చైర్మన్‌గా భీమరాజు



ఉప్పలగుప్తం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అమలాపురం తాలూకా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం చైర్మన్‌గా ఎస్.యానాంకు చెందిన లంకే భీమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు నాగిడి నాగేశ్వరరావు, కొల్లు సత్యనారాయణమూర్తి(బాబ్జి) ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అరదాని శ్రీను, కె.రామారావు, కార్యదర్శిగా కొప్పాడ వెంకటరామకృష్ణ, 24మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్సీ క్యాంపెయిన్‌లో ఐవీ

అంతర్వేది, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం, అంతర్వేదిపాలెం, మోరి, గొంది గ్రామాల్లోని పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎలక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా ఎమ్మెల్సీ ఐవీ ఉపాధ్యాయులను కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై పలు పాఠశాలల్లో ఐవీ ఉపాధ్యాయ బృందాలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికలపై వారితో చర్చించారు. యూటీఎఫ్ నాయకులు, నాలుగు పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. యూటీఎఫ్, ప్రజా సంఘాలు బలపరిచిన టీచరు ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని గెలిపించాలని కోరారు.

బకాయి జీతాలు విడుదల చేయాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఫార్మాసిస్ట్‌లకు గత వైసీపీ ప్రభుత్వం ఐదు నెలల 14రోజుల వేతనాలతో పాటు రెండేళ్ల పీఎఫ్‌ను బకాయి పెట్టిందని, ఒక్కో ఉద్యోగికి రూ.2లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉందని ఎన్‌హెచ్ఎం ఉద్యోగ సంఘ నాయకుడు నున్న వీరవెంకటసత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిపడ్డ వేతనాలను చెల్లించాలని నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీలను కలిసి ఆప్కోస్ మెడికల్ అండ్ హెల్త్ ఫార్మాసిస్ట్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఈఏడాది ఆగస్టు 12న కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ అందజేసినా ఇంత వరకు జీతాలు విడుదల కాలేదన్నారు. 2021 జూలై నుంచి డిసెంబరు 14వరకు జీతాలను నిలుపుదల చేయడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరలో ఆందోళన చేపట్టనున్నట్టు తెలిపారు.

పోస్టుమన్ల వద్దే జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికెట్లు

అమలాపురం టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పెన్షన్‌దారులు సమర్పించాల్సిన వార్షిక లైఫ్ సర్టిఫికెట్లను సమీపంలోని పోస్టుమన్ల వద్దే పొందవచ్చునని అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ తెలిపారు. తపాల శాఖ ఆధ్వర్యంలో ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా కేంద్ర ప్రభుత్వ, అనుబంధ సంస్థల పెన్షన్‌దారులు నవంబరు, డిసెంబరు నెలల్లో వార్షిక లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉందన్నారు. పోస్టుమన్ల వద్ద లైఫ్ సర్టిఫికెట్లు పొందే ఏర్పాటు చేశామన్నారు. నవంబరు 1న డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. పోస్టుమన్ ద్వారా ఈసదుపాయాన్ని పెన్షన్‌దారులు ఇంటి వద్ద పొందే సదుపాయం కల్పించామన్నారు. ఈసర్వీసును పొందే పెన్షన్‌దారులు ఆన్‌లైన్‌లో పోస్టు ఇన్ఫో ద్వారా రిక్వెస్ట్ చేసుకుంటే వారి పెన్షన్ పేఆర్డరు, ఆధార్ నంబరు, బ్యాంకు ఖాతా, వివరాలు, మొబైల్ నంబరును తీసుకురావాల్సి ఉంటుందన్నారు. కేవలం రూ.70కే లైఫ్ సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఈఅవకాశాన్ని పెన్షన్‌దారులంతా అమలాపురం, రాజోలు హెడ్ పోస్టాఫీసులు, జిల్లాలోని పోస్టాఫీసుల్లో కూడా వినియోగించుకోవచ్చునని సూపరింటెండెంట్ తెలిపారు.

రూ.5లక్షల పరిహారం అందజేత

మామిడికుదురు,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆపదలో ఉన్న పేదలకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. విశాఖ జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో పేలుడులో ఆగస్టు 21న జరిగిన పేలుడులో పాశర్లపూడిలంకకు చెందిన మారిశెట్టి సతీష్ మృతిచెందగా మాజీ సీఎం జగన్ ప్రకటించిన రూ.5లక్షల పరిహారాన్ని చెక్కు రూపంలో భార్య నాగమణికి అందించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మాజీ సర్పంచ్ నీతిపూడి గణేష్‌బాబు, కొమ్ముల రాము, తులా గోపాలకృష్ణ, ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

అమలాపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కామనగరువు రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ ముఖ్య అతిథిగా హాజరై సమాచార హక్కుచట్టం గురించి తెలియచేయడంతో పాటు ఏవిధంగా దరఖాస్తు చేయాలో తదితర అంశాలను వివరించారు.

వెన్నెల ఆత్మహత్య ఘటనపై విచారణ జరిపించాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చెముడులంక షిర్డీ సాయి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థిని చెక్కపల్లి వెన్నెల ఆత్మహత్య ఘటనపై విచారణ జరిపించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో పనిచేస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం వేధింపుల కారణంగానే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈఘటనపై పోలీసులు, విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపించి, నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వెంకట్, సురేష్, నూకన్న ప్రసాద్, శ్యామ్, వినయ్, ఉదయ్, సుహాస్, గణేష్ కోరారు.

ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్లు

యానాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యానాం నేతాజీసుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐలో 2024 విద్యా సంవత్సరానికి మారోసారి ఈనెల 30వతేదీ వరకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణాసుధాకర్ తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9491441164, 0884-2951001ను సంప్రదించాలన్నారు.

పోలీసు విధులపై అవగాహన

మామిడికుదురు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరం పోలీసు స్టేషన్‌లో బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం జరిగింది. పోలీసుల విధులు, బాధ్యతలు, ఆయుధాలు, వాటి పనితీరు గ్రామాల నైసర్గిక స్వరూపం తదితర అంశాలపై విద్యార్థులకు ఎస్ఐ చైతన్యకుమార్ అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓపెన్ హౌస్ నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆధార్'ను వినియోగించుకోవాలి

అంబాజీపేట, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జీవీ సరోవర్ అన్నారు. మండలంలో మాచవరం, ఇరుసుమండ, నందంపూడి గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ క్యాంపులను ఆయన పరిశీలించారు. ఈనెల 25వ తేదీ వరకు క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

టీడీపీ నాయకుల పరామర్శ

ఐ.పోలవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న నీటిపంపిణీ సంఘం మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు సాగి రాజు సూరిబాబురాజును బుధవారం పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. తాడి నరసింహారావు, బండారు వీరబాబు, దాట్ల బాబు, పాయసం చిన్ని, యాళ్ల ఉదయ్ పరామర్శించారు.

సమస్యల వలయంలో గ్రంథాలయం

● అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం
● రెండేళ్లుగా ఇన్‌చార్జ్‌తోనే కాలక్షేపం

అలమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత దశాబ్ద కాలంగా అలమూరు శాఖా గ్రంథాలయం సమస్యల వలయంలో సతమతమవుతోంది. అసంపూర్తిగా ఉన్న భవనం, సిబ్బంది లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఈ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి, అటెండర్, స్వీపర్ పోస్టులు ఉండాల్సిఉండగా రెగ్యులర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో స్వీపర్ మాత్రమే ఉన్నారు. ఆత్రేయపురం గ్రంథాలయాధికారికి ఇక్కడ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన వారం రోజులలో మూడురోజులు ఆత్రేయపురంలోను, మరో మూడురోజులు అలమూరులోనే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన మూడు రోజులు స్వీపర్ మాత్రమే అందుబాటులో ఉండటంతో గ్రంథాలయం తలుపులు తీస్తున్నారు. గ్రంథాలయం పైభాగంలో రీడింగ్ హాల్ కోసం శ్లాబ్ వేసి నప్పటికీ అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పుస్తకాలను భద్రపరచడానికి ఇబ్బందిగా ఉంది. పైన రీడింగ్‌హాల్ పూర్తిచేస్తే పూర్తిస్థాయిలో దిగువ భాగంలో పుస్తకాలను ఉంచుకోవడానికి వీలుగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో 20 గ్రంథాలయాలు ఇన్‌చార్జ్‌లతోనే..

జిల్లాలో దాదాపు వందవరకు గ్రంథాలయాలు ఉంటే 20 వరకు గ్రంథాలయాలు ఇన్‌చార్జ్‌లతోనే నడుస్తున్నాయి. ఒక్కొక్కరికి రెండు కేటాయింపు చేయడంతో వారంలో మూడురోజులు ఒకచోట మరో మూడురోజులు ఇన్‌చార్జ్ వేసినచోట విధులు నిర్వహించాల్సి వస్తోంది. సిబ్బంది కొరత కారణంగా ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది.


అలమూరు శాఖా గ్రంథాలయం



ఇరుకుగదిలో ఉన్న పుస్తకాల ర్యాక్‌లు, గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

రూ.6 లక్షలు నిధులు కేటాయించాలి

● ఈదల సత్యనారాయణచౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్, అలమూరు



గ్రంథాలయం పైభాగంలో శ్లాబ్ వేసి వదిలేశారు. దీనికి రూ.6 లక్షల నిధులు కేటాయింపు చేస్తే రీడింగ్ హాలు అందుబాటులోకి వస్తోంది. కిందభాగంలో పుస్తకాలను భద్రపరుచుకోవచ్చు. మండల పరిషత్ నుంచి నిధులు కేటాయింపు చేయాలని కోరాం.

పోటీ పరీక్షలకు అందుబాటులో పుస్తకాలు

● టి.నమశ్శివాయ, గ్రంథాలయాధికారి (ఇన్‌చార్జ్)



ఆలమూరు గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. రీడింగ్ హాలు అందుబాటులోనికి వస్తే బాగుంటుంది. ఆలమూరు గ్రేడ్-2 గ్రంథాలయంగా గుర్తింపు పొందింది. దీంతో రెగ్యులర్ గ్రంథాలయాధికారిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

రీ సర్వేలో పొరబాట్లను సరిదిద్దేందుకే గ్రామసభలు

● ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ రీసర్వే లో జరిగిన పొరబాట్లను సరిదిద్దేందుకే కూట మి ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని పడమరఖండ్రిక పంచాయతీ కార్యాలయంవద్ద గ్రామసర్పం చ్ తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశరరావు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రీసర్వేలో జరిగిన పొరబాట్లను సరిదిద్దేందుకు గ్రామసభల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అ నంతరం కోరుమిల్లి గ్రామానికి చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.లక్షా28వేలు, రూ లక్షా23వేలు చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్, తహసీల్దార్ చిన్నారావు, కార్యదర్శి సత్తిబాబు, వీఆర్‌వో సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

భూముల రీసర్వే సమస్యలు పరిష్కరిస్తాం

ద్రాక్షారామ, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): భూములు రీసర్వేలో తలెత్తిన సమస్యలు అర్జీల ద్వారా తెలియచేస్తే పరిష్కరిస్తామని తహసీల్దార్ వెంకటేశ్వరరావు చెప్పారు. రామచంద్రపురం మండలం హసన్‌బాదలో బుధవారం సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీసర్వేలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. గ్రామసభలో వీఆర్‌వో సత్తిబాబు, కార్యదర్శి శ్రీనివాస్, వెల్ల వీఆర్‌వో సూర్యకుమారి, గ్రామ సర్వేయర్ ప్రమోద్, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కె.గంగవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భూసర్వేలో ఏర్పడిన సమస్యలు పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. బుధవారం యండగండిలో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. మండల సర్వేయర్ పావని మాట్లాడుతూ సభల్లో వచ్చి న ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కారం చేస్తామన్నారు. సమస్యలు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకట్రావు, ఎంపీటీసీ కడలి సత్య సూర్యకుమారి, వీఆర్వో పామర్తి బాబి, సర్వేయర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బకాయి నిధులు మంజూరు చేయండి

● మంత్రి లోకేశ్‌ను కలిసిన జి.వి.రావు


మంత్రి లోకేశ్‌ను కలిసిన జి.వి.రావు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవెయిల్‌బుల్ స్కూల్స్ పథకంలో పాఠశాలలకు చెల్లించాల్సిన బకాయి నిధులు మంజూరు చేయాలని మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జీవీ రావు మంత్రి లోకేష్‌ను కోరారు. ఈమేరకు మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను జి.వి.రావు కలిశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో బెస్ట్ అవెయిల్‌బుల్ స్కూల్స్ ద్వారా పేద విద్యార్థులకు వసతి సౌకర్యంతో విద్యను అందించామన్నారు. అందుకుగాను ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్ని సార్లు విన్నవించుకున్నా బకాయిలు చెల్లింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రపురంలో తమ పాఠశాలలో 400మంది విద్యార్థులకు సంబంధించి బిల్లుల బకాయిలు ఉన్నాయన్నారు.

నెలపర్తిపాడులో పొలం పిలుస్తోంది

ద్రాక్షారామ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం నెలపర్తిపాడులో బుధవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పంట కాలువలు పూడిక తీయడం, వ్యవసాయ యంత్రాలు అవసరం మేరకు తీసుకోవడం, ధాన్యం కొనుగోలులో మార్పులు వివరించారు. ఈపంట ప్రయోజనాలను మండల వ్యవసాయాధికారి సత్యప్రసాద్ వివరించారు. మండల పశు వైద్యాధికారి డా.కృష్ణార్జున పశువుల వ్యాధులు గురించి వివరించారు. కార్యక్రమంలో రాయుడు వీర్రాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ, ప్రసూతి వైద్య శిబిరం

కపిలేశ్వరపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించిన బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ నూతన భవనంలో బుధవారం గర్భిణీ, ప్రసూతి వైద్యశిబిరం నిర్వహించారు ఈశిబిరంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డా. కె. కన్యాకుమారి 32మందికి వైద్యపరీక్షలు చేశారు. వారు తీసుకోవల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, ఆసుపత్రి ప్రసవం ప్రాముఖ్యత, తదితర అంశాలపై అవగాహన కల్పించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డా. రత్నకుమారి, ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు, హెచ్‌వీ టి. మేరీమణి, స్టాఫ్‌నర్సు, ల్యాబ్‌టెక్నీషియన్, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణం కోసం

కేబుల్ ఆపరేటర్ల రూ.లక్ష విరాళం

మండపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంకోసం మండపేట నియోజకవర్గ కేబుల్ ఆపరేటర్లు రూ.లక్ష చెక్కును బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు స్థానిక పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కేబుల్ ఆపరేటర్ల సంఘ నాయకులు దూలం నాగేశ్వరరావు (నాగు), నక్కా వెంకటేశ్వర రావు, టీడీపీ నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, కోలు పోటి బాబు, పర్వతిన వీర్రాజు, మేకా జేజిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన నగదును నియోజకవర్గంలోని ఆరుగురికి రూ.3,59,416 బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జోగేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో సుంకర బుజ్జి, మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చేకూరి రమేష్‌రాజు, నాయకులు వల్లూరి శ్రీనివాస్, వీర్రెడ్డి, చల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

కపిలేశ్వరపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకిలో బుధవారం మండలస్థాయిలో సమాచార హక్కు చట్టం-2005(ఆర్‌టీఐ) పై గ్రామవ్యవసాయ సహాయకులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ సమాచార హక్కు చట్టం(2005) మే 11న లోక్‌సభలో ఆమోదించడం జరిగిందన్నారు. ప్రతీ అధికార యంత్రాంగంలో పారదర్శకత జవాబుదారీ తనం తీసుకురావడంకోసం అధికార యంత్రాంగాల అదుపులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు పౌరులకు ఉన్న సమాచార హక్కును చట్టబద్ధం చేసేందుకు ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. కేంద్రసమాచార కమీషన్‌ను, రాష్ట్రసమాచార కమీషన్‌ను నెలకొల్పడం కోసం, ఇతర అంశాల కోసం ఆదేశించినది ఈ చట్టం అన్నారు. ఇందులో వ్యవసాయశాఖ సబ్ డివిజన్ లెవెల్‌లో సహాయ వ్యవసాయ సంచాలకులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఆ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న మండల వ్యవసాయాధికారులు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈకార్యక్రమంలో రైతులు, గ్రామవ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే వేగుళ్ల


వెదురుమూడిలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని వెదురుమూడి బీసీ కాలనీలో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగం గా ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.25లక్షలతో నిర్మించనున్న 5 సీసీరో డ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే వేగుళ్ళ స్థానిక నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. అంగర ఉన్నత పాఠశాల సమీపంలో డంపింగ్‌యార్డ్‌కు వెళ్లే గ్రా వెల్ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. పడమరఖండ్రిక పంచాయతీ కార్యాలయం సమీపం లో గత 5 సంవత్సరాలుగా మూతపడిన ఆర్వో ప్లాంటు మరమ్మతులు చేసేందుకు ప్రజాకార్యక్రమాలు నిర్వహించారు.గ్రామమాజీ సర్పంచ్ ఇళ్ళ నాగమణి, రాంబాబు, అంగర గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ దుర్గారావు, ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, కూటమి నాయకులు పుత్సల శ్రీనివాస్, బోణం నానిబాబు, చుండ్రు అచ్యుతరామారావు, మురళీకృష్ణ, ఎంపీడీవో రత్నకుమారి, తహసీల్దార్ చిన్నారావు, మండల ఇంజనీర్ డీవీ రాఘవులు, కార్యదర్శులు ఆర్. మోహన్, వై.శారద, ఆయా గ్రామస్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టేకి, నల్లూరులో ఉపాధిహామీ గ్రామసభలు

కపిలేశ్వరపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని టేకి, నల్లూరు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కుక్కల నాగమణి, కురుపూడి ఉదయశ్రీ రాంబాబు అధ్యక్షతన బుధవారం ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు ఈ గ్రామసభల్లో 2025-26లో చేపట్టనున్న పనులను గుర్తించి సభలో చదివి వినిపించారు. ఉపాధిహామీ పథకం నిధులు గ్రామాల అభివృద్ధికి తోడ్పడతాయని టెక్నికల్ అసిస్టెంట్ లోవరాజు వివరించారు. జాబ్‌కార్డు కలిగిని రైతులు ఉద్యానవన పంటలు సాగుచేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమాల్లో నల్లూరు ఎంపీటీసీ మధుకుమారి, ఉమ్మిడిశెట్టి వీరవేణి, కార్యదర్శి రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్లు రమేష్, పంపన శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు, రైతులు పాల్గొన్నారు.

త్వరలో కేశవరం, జెడ్.మేడపాడులో రైల్వే ఫ్లైఓవర్లు

● ఫ్లైఓవర్ల నిర్మాణాలకు రైల్వే శాఖ గ్రీన్‌సిగ్నల్ ● భూసేకరణ కోసం సర్వే చేపట్టిన రెవెన్యూ, రైల్వే శాఖాధికారులు ● కేశవరంలో రెండున్నర ఎకరాల స్థలం అవసరం



కేశవరంలో రైల్వేగేటు వద్ద వేచివున్న ప్రయాణికులు (ఫైల్), జెడ్.మేడపాడులో ఫ్లైఓవర్ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, రైల్వే, రెవెన్యూ అధికారులు(ఫైల్)

మండపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కేశవరం, జెడ్.మేడపాడు గ్రామాల్లో రైల్వేశాఖ ఫ్లైఓవర్ల నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే తొలుత ద్వారపూడిలో రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మించారు. కేశవరం, జెడ్.మేడపాడు గ్రామాల్లో నిర్మించే ఫ్లైఓవర్ వంతెనకు సంబంధించి కేశవరంలో కొంతమేర భూసేకరణ అవసరం అవుతున్ననేపథ్యంలో రెవెన్యూ, రైల్వే శాఖాధికారులు భూసేకరణ కోసం సర్వే చేపట్టారు. కేశవరంలో మూడు రకాలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కేశవరంలో రెండున్నర ఎకరాలు మేర భూమి అవసరమవుతుందని రైల్వే అధికారులు గుర్తించారు. ఇక్కడ ప్రభుత్వ భూమి ఎంత ఉంది, రైతుల నుంచి ఎంతమేర భూసేకరణ చేయాలనేదానిపై రెవెన్యూ శాఖ సర్వే చేసి భూమి అప్పగిస్తే రైల్వే శాఖ వంతెన పనులకు శ్రీకారం చుట్టనుంది. అలాగే జెడ్.మేడపాడులో నిర్మించే వంతెనకు సంబంధించి భూసేకరణ అనవరం లేకపోవటంతో ఇక్కడ వంతెన పనులకు ఎటువంటి ఇబ్బంది లేదు. కేశవరం, జెడ్.మేడపాడు గ్రామాల్లో రైల్వే వంతెనలు నిర్మిస్తే నిత్యం వాహనదారులు పడే ఇబ్బందులు తొలుగు తాయి. ఇప్పటికే రైల్వేశాఖాధికారులు, ఎమ్మెల్యే వేగళ్ల జోగేశ్వరరావు, రెవెన్యూ రహదారులు భవనాల శాఖాధికారులు వంతెనకు సంబంధించి భూసర్వే, వంతెన నిర్మించే ప్రదేశాలను పరిశీలించి వెళ్లారు. భూసేకరణ పూర్తయితే రెండు వంతెనలు పనులు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈఫ్లైఓవర్లు పూర్తయితే ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరతాయి. ఇకపోతే ద్వారపూడి రైల్వే వంతెనకు కూత వేటు దూరంలో ఉన్న జెడ్.మేడపాడు రైల్వే గేటు ఉంది. దీనిని మూసివేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. త్వరలోనే ఈగేటును రైల్వే శాఖ మూసివేయనుంది.

మోటార్ బైక్ దొంగ అరెస్టు

కె.గంగవరం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): కుందూరు గ్రామంలోమోటార్‌బైక్ దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు పామర్రు ఎస్‌ఐ ఎస్.కె.జానీబాషా చెప్పారు. కుందూరుకు చెందిన గుత్తుల వెంకటకుమార్ గత సంవత్సరం ఆగస్టు 28న తన స్నేహితుడికి చెందిన మోటార్‌బైక్ చోరీకి గురైందని ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాలతో రామచం ద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో రామచంద్రపురం సీఐ అశోక్‌కుమార్ పర్యవే క్షణలో పామర్రు ఎస్ఐ ఎస్.కె.జానీ బాషా, క్రైమ్‌పార్టీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఈశ్వర రావులు కె.సతీష్, టి.వి. లక్ష్మణ్‌బాబు బృందంగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గాలింపు చర్యలు చేపట్టారు. కాకినాడ గాంధీనగర్‌కు చెందిన ఇంటి సురేంద్ర చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడిని మంగళవారం అరెస్టుచేసి, రామచంద్రపురం కోర్టులో హాజరు పర్చామని ఎస్ఐ జానీ బాషా చెప్పారు. చేశారు. అతని వద్ద నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసును ఛేదించిన దుకు పోలీసు బృందాన్ని ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

అముజూరులో 60పనులు గుర్తింపు

కె.గంగవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో అముజూరులో 60పనులు చేయడానికి గుర్తిం చారు. బుధవారం గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ నానావరపు కళ్యాణి శ్రీనివాస్ అధ్య క్షతన ఉపాధి గ్రామసభ జరిగింది. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె.దుర్గాప్రసాద్, ఎన్‌ఆర్‌జీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్ పెంకే రాంబాబు పాల్గొన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి శివారు శెట్టిబలిజపాలానికి చెందిన పిల్లి అభిషేక్(13) ఆదివారం సాయంత్రం గోదావరి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి గల్లంతయ్యాడు. నాలుగు రోజుల నుంచి గాలింపు చర్యలు చేపడుతున్నారు. బుధవారం బాలుడు మృతదేహం లభ్యమైంది. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన

రాయవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వెదురుపాక దేవిసెంటర్ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. 40ఏళ్ల నుంచి దేవి సెంటర్‌లో దేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వెదురుపాక, నదురుబాద, వి.సావరం, ఆరికరేవుల, కొంకుదురు, రాయవరం గ్రామాలకు చెందిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి: చిట్టిబాబు


జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబును సత్కరిస్తున్న కార్యకర్తలు

రాహుల్‌గాంధీ ప్రధాని కావడం తథ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు కోరారు. రామచంద్రపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి కోట శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం ఆర్‌ఆర్ గ్రాండ్‌లో జరిగింది. సమావేశంలో కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి కమిటీల నిర్మాణం జరపాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీని పూర్తిగా బలోపేతం చేయాలని కోరారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో వైసీపీ, తెలుగుదేశం పార్టీలు ప్రజా విశ్వాసం కోల్పోయాయన్నారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాహుల్‌గాంధీ ప్రధాని కావడం తథ్యమన్నారు. పీసీసీ ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొండేటి చిట్టిబాబును సత్కరించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్.డి.ఖాన్, కె.గంగవరం మం డల అధ్యక్షుడు దొంగ ఉదయ్‌కుమార్, మెహతాబ్ ఖురేషి, రామకృష్ణ శెట్టి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్


ఎమ్మెల్యే వేగుళ్ల, మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరిన 22వ వార్డు వైసీపీ కౌన్సిలర్ సరస్వతి

మండపేట, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): వైసీపీ కౌన్సిలర్ బొక్కా సరస్వతి బుధవారం టీడీపీలో చేరారు. దీంతో వైసీపీకి చెందిన 8మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరినట్లయింది. 22వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ బి.సరస్వతి అనుచరులతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ సమక్షంలో స్థానిక టీడీపీ కార్యాయంలో టీడీపీలో చేశారు. ఆమెను, అనుచరులను ఎమ్మెల్యే వేగుళ్ల టీడీపీలోకి ఆహ్వానించారు. వైసీపీలో స్వేచ్ఛలేదని, అభివృద్ధి, సంక్షేమం కోసం, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో వేగుళ్ల నాయకత్వంలో పని చేసేందుకు టీడీపీలో చేరినట్టు ఆమె చెప్పారు. కౌన్సిల్‌లో ఏడుగురు టీడీపీ కౌన్సిలర్లు ఉన్నారు. వైసీపీ నుంచి 8మందితో రావడంతో టీడీపీ బలం 15కి చేరింది. టీడీపీ నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మల్లిపూడి గణేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు, కాశిన కాశీవిశ్వనాథం, గ్రంధి శ్రీనివాస్, మలసాని సీతామహాలక్ష్మీ, టీడీపీ నేతలు మందపల్లి దొరబాబు, చెరుకూరి బాపిరాజు పాల్గొన్నారు.

ముస్సిపల్ బకాయిలపై ఫ్లెక్సీ ఏర్పాటు

అక్టోబరు అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపాల్టీ పరిధిలో వ్యాపార సముదాయాలకు సంబంధించి బకాయిలు ఉన్నాయి. వ్యాపారుల నుంచి బకాయిలు రాబట్టేందుకు మున్సిపల్ అధికారులు బాకీదారుల జాబితాను పట్టణంలో పలు ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేవారు. బుధవారం స్థానిక కరాచీ సెంటరులో బాకీదారులు జాబితాను ఫెక్సీ ఏర్పాటు చేశారు. వ్యాపారుల నుంచి రూ.కోట్ల బకాయిలు రావాల్సి వున్న నేపథ్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ రంగారావు తెలిపారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

మండపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలోని 30వ వార్డుల్లో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు, పొడి, తడి చెత్తగా వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి ఇచ్చేలా చూడాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు మెప్మా సిబ్బందిని కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా మేనేజర్ సుజాత ఆధ్వర్యంలో ఆర్‌పీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తడి, పొడి చెత్త గురించి వివరించారు. ప్రజలకు శానిటేషన్‌పై అవగాహన కల్పించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగించకుండా క్లాత్ బ్యాగ్స్ ఉపయోగించేలా అవగాహన కల్పించాలని మెప్మా సిబ్బందికి కమిషనర్ సూచించారు.

అయ్యప్ప శరణఘోషతో మార్మోగిన ర్యాలి



ర్యాలిలో అయ్యప్ప కలశ పూజ నిర్వహిస్తున్న దృశ్యం, కలశ పూజలో పాల్గొన్న స్వాములు

ఆత్రేయపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి మండల దీక్ష చేపడతున్న అయ్యప్పస్వాముల శరణుఘోషతో ర్యాలి గ్రామం మారుమోగింది. బుధవారం స్థానిక వెంకటేశ్వరనగర్‌కు చెందిన పడాల సంతోష్‌స్వామి ఇంటి వద్ద 54 కలశల పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది స్వాములు పవిత్ర నదీ చెంతకు వెళ్లి కలశాలతో పవిత్ర జలాలను తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. అరటి డొప్పలతో పుష్పాలు గుచ్చి మండపం తయారు చేశారు. స్వాములంతా కలశల వద్ద కుర్చీని గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి అయ్యప్ప సహస్ర నామాలు భక్తితో నిర్వహించారు. శరణుఘోషతో ఆ ప్రాంతం మారుమోగింది. 54కలశల వద్ద పడి పూజ నిర్వహించారు. ఎస్వీ గురుస్వామి ఆశీస్సులతో కన్నటబాబు గురుస్వామి సారథ్యంలో జరిగిన పడిపూజలో తాటిపాక కృష్ణగురుస్వామి అయ్యప్ప గానామృతం స్వాములను ఉర్రుతలూగించింది. కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ఈపూజా మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వాములు, భక్తులకు పడి ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి: సీఐ

మండపేట,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆటో డ్రైవర్లుట్రాఫిక్ నిబం ధనలు పాటించాలని మండపేట రూరల్ సీఐ పి.దొరైరాజు ఆటో యూనియన్ సభ్యులకు ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. మండపేటలో బుధవారం ఆటో యూనియన్ సభ్యులు, నాయకులతో పట్టణంలో ట్రాఫిక్‌పై సమావేశం నిర్వహించారు. ఆటోలు పార్కింగ్ విషయంలో పడుతున్న ఇబ్బందులు గురించి డ్రైవర్లు సీఐకు వివరించారు. ఆటో స్టాండ్‌లో మాత్రమే పార్కు చేసేలా చూడాలని పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రిని సీఐ ఆదేశించారు. మద్యం తాగి ఆటో నడిపితే చర్యలు తప్పవన్నారు. ఆటో యూనియన్లకు చెందిన 60మంది పాల్గొన్నారు.

భూసంబంధ సమస్యలు పరిష్కరించుకోవాలి

తహసీల్దారు వై.రాంబాబు


సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు రాంబాబు

కొత్తపేట, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూసంబంధ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దారు వై.రాంబాబు తెలిపారు. బుధవారం మండల పరిధి మందపల్లిలో తహసీల్దారు రాంబాబు అధ్యర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూసర్వేకు సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మందపల్లికి సంబంధించి 12 సమస్యలు అర్జీ రూపంలో వచ్చాయని, వాటిని పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామన్నారు. ఈసదస్సులో సాధు చెంచయ్య, మాజీ సర్పంచ్‌లు చింతం విజయకృష్ణమోహన్, సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, ఆర్ఐ రవిశంకర్ పాల్గొన్నారు.